క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా నాల్గవ చివరి గురువారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో తెల్లవారు జామున 4గంటల నుంచి దర్శనానికి వదిలారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయి దేవాలయం వెలుపల నిలబడి స్వామిని దర్శించుకోవడం కనిపించింది. స్వామిని దర్శించుకుని నైవేద్యం సమర్పించడానికి భక్తులు బుధవారం రాత్రి నుంచే తరలిరావడంతో ఈరన్న క్షేత్రం భక్తులతో పోటెత్తింది.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల కాలేజీ, గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ హరిష్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గురుకుల కాలేజీ, పాఠశాలలో విద్యార్థినీలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాదయాత్రికుడికి సన్మానం


బాటసారిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

మంత్రాలయం: కర్ణాటకలోని బళ్లారి జిల్లా శిరుగుప్పకు చెందిన గోపాలకృష్ణ వయసు 68 ఏళ్లు. ఆ వయసులోనూ 2800 కి.మీ. పాదయాత్ర చేశాడు. శిరుగుప్ప నుంచి ఫిబ్రవరి 22న వారణాసికి బయలుదేరాడు. రోజుకు 15 కి.మీ. చొప్పున కాలినడక వెళ్తూ ఆగస్టు 15న వారణాసి చేరుకున్నాడు. 9 రోజుల పాటు వారణాసిలో కాశీ విశ్వనాథ్‌ని సేవలో తరించాడు. బుధవారం మంత్రాలయం చేరుకున్న వృద్ధుడికి ఆర్యవైశ్య సత్ర సూపర్ వైజర్ లక్ష్మయ్య శెట్టి నేతృత్వంలో పాదపూజ చేశారు. లోకకల్యాణార్థం ఈ పాదయాత్ర చేపట్టినట్లు గోపాలకృష్ణ పేర్కొన్నారు.

రాజగోపురానికి రూ.1.94 లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకందలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి గురువారం కర్నూలు పట్టణానికి చెందిన యాడికి శ్రీకాంత్ గుప్తా, రమ వారి కుటుం బ సభ్యులు రూ.1,94,000 అందజేసినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలు, బాండు అందజేశారు. ఆలయ అర్చకుడు ఈరన్నస్వామి పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తాం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: పట్టణంలోని వార్డులో పర్యటించి, సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం పట్టణంలోని పర్వతాపురం వార్డులో అధికారులో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య ఉన్నా నేరుగా తన దగ్గరకు వచ్చి తెలపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనుపమ, టీపీఓ, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రేపు స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: అవోపా మరియు వామ్ ఆదోని వారి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందు రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 31వ తేదీన చేపడుతున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా గురువారం తెలిపారు. ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష సౌజన్యంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియర్ స్వామి వారి ఆశీర్వాదంతో పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానంలో స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ చేపడతామన్నారు. ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల్లోపు పిల్లలకు ఈ మందును వేసుకోవచ్చన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్


ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


కౌతాళం కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి


నదిచాగి జెడ్పీ పాఠశాలలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెబుదాం

• ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవం

ఆదోని సెంట్రల్: తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెబుదామని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్, అవోపా, వ్యామ్ సంయుక్తంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలను గురువారం స్థానిక గరల్స్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. అలాగే క్రీడా దినోత్సవాన్ని చేపట్టారు. విద్యార్థులకు ఆటల పోటీలు, తెలుగు వెలుగు మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

- నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో తల్లికి పద్య తోరణం పేరుతో విద్యార్థులకు పద్యాలాపన పోటీలను నిర్వహించారు. పోటీలలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మంది ప్రతిభను చాటి బహుమతులను అందుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ప్రహ్లాద్ తెలుగు భాష ఔన్నత్యాని గురించి వివరించారు.
- ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం రమేష్ నాయుడు తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.
- ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన తెలుగు భాష దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. పదవీవిరమణ పొందిన తెలుగు ఉపాధ్యాయుడు సుస్వరం నాగరాజు తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి అందించిన సేవలను కొనియాడారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కడివెళ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పేరు అకారంలో విద్యార్థులు కూర్చొని వేడుకలు నిర్వహించారు.





కడివెళ్ల జెడ్పీ పాఠశాలలో గిడుగు అక్షరాల అకారంలో కూర్చున్న విద్యార్థులు, గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక శ్రీమహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుబాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుశీలమ్మ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయినులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనుబాబు, మనోజ్‌కుమార్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని సీఐ గంగాధర్, స్కూల్ చైర్మన్ గౌస్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ లో ప్రిన్సిపల్ షాహీనా పర్వీన్ ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలో పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దస్తగిరి బాషా, ఉపాధ్యాయులు మాతృభాషా, క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి, వాడుక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి, క్రీడా పితామహుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్యాలు, కృత్యాల పోటీలు అలరించాయి. కార్యక్రమంలో గ్రామ పెద్ద రామిరెడ్డి, ఉపాధ్యాయులు నెల్లూరు వెంకట లక్ష్మి, యశోద, రామ్మూర్తి, నాగేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కౌతాళం: తెలుగుభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి విద్యార్థి ముందుకు రావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రతిభ హైస్కూల్‌లో, నదిచాగి జెడ్పీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నదిచాగి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పంపాపతిగౌడ్, ప్రతిభ పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాష తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులోని బాలికల హైస్కూల్‌లో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు


ఎమ్మిగనూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్


ఆదోనిలో ధ్యాన్ చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా. పార్థసారథి


పల్లెపాడులో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసిన ఉపాధ్యాయ బృందం

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు


ఆదోనిలో ర్యాలీ చేపట్టిన క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడా కారులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం వ్యాయమ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడ దినోత్సవ వేడుకల్లో ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం పురపాలక మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడ దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డా. పార్థసారథి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుకుంటూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, పురపాలక చైర్మన్ శాంత, పురపాలక అసిస్టెంట్ కమిషన్ అనుపమ, టుటౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విష సంస్కృతికి తెరలేపుతున్న కూటమి ప్రభుత్వం

ఆదోని సెంట్రల్: ప్రశాంతంగా ఉండే ప్రజల మధ్య చిచ్చుపెట్టి విష సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెరలేపుతుందని వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి విమర్శించారు. గురువారం ద్వారక కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం అక్రమకట్టడం అంటూ బ్యానర్లను వేయడం సరికాదని మండి పడ్డారు. స్థలానికి దాదాపు 30 ఏళ్లుగా మన్సిపాలిటికీ ట్యాక్స్ కూడా చెల్లిస్తున్నారని, స్థల యాజమాన్యం అనుమతితో లీజుకు తీసుకుని బిల్డింగ్ కట్టారని చెప్పారు. ఎవరు దౌర్జన్యం చేసి లాక్కొని కట్టినది కాదన్నారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎన్‌జీఓ నాయకులు చాల స్పష్టంగా చెప్పారని తెలిపారు. కొంత మంది ఎమ్మెల్యే ఫొటోతో పాటు తమ ఫొటోలతో బ్యానర్లను కట్టడం విచారకరమన్నారు. కార్యాలయానికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారని, ఏదైనా ఉంటే కోర్టుకు వెళ్లండి అంతేకాని చౌకబారు రాయకీయాలు మంచిది కాదని హితవు పలికారు. పురపాలక అధికారులు, ఎమ్మెల్యే స్పందించి తక్షణమే బ్యానర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ రాజేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కిశోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణ గౌరవ అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి

ఎన్‌సీసీలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎన్‌సీసీ కమాండెంట్లు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌సీసీ క్యాంపులో ప్రతిభ చాటినట్లు క్యాంపు కమాండర్ జోబీ ఫిలిప్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో జరిగిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన 500 మంది క్యాడెట్స్‌కు వివిధ అంశాలపై 10 రోజులు పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో నిర్వహించిన పోటీలలో నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని సిల్వర్ పతకాలను సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమములో ఎన్‌సీసీ అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహితీవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 53, 54వ పుస్తకాలు 'పాల బుగ్గలు – పూల మొగ్గలు', 'కాంతి కిరణాలు' పుస్తకాలను తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషాభివృద్ధి సార్వ జనిక్ గ్రంథాలయం షోలాపూర్(మహారాష్ట్ర)లో గురువారం ఆవిష్కరించారు. ఈ పస్తుకాలను కళాపోషకులు విశ్రాంత ఉపాధ్యాయులు రాజగోపాల్ దంపతులకు అంకితమివ్వడం విశేషం. ఇదే వేదికపై రాధాసురేష్ విరచిత 'రాధా మధురిమలు' పుస్తకావిష్కరణ కూడా జరిగినట్లు గద్వాల సోమన్న తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మొక్కలను పెంచుదాం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. వీరన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవలింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి

గోనెగండ్ల: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని వీరశైవ లింగాయత్ సంఘటన్ వేదిక జాతీయ సలహాదారు జిజి.మనోహర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో భాద్రపద మాసం సెప్టెంబర్ 3వ తేదీన వీరభద్ర స్వామి జయంతి ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. లింగాయత్ వంద జనాభా వున్న గ్రామాల్లో రుద్రభూమి కేటాయించాలని, పేద విద్యార్థులకు ప్రభుత్వం చేయూతనివ్వాలన్నారు. సమావేశంలో వీరశైవ లింగాయత్ సంఘటన వేదిక రాష్ట్ర కన్వీనర్ అమరేషప్ప, పట్టణ అధ్యక్షుడు బాబుధని, పీఠాధిపతి శివయ్య స్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగి శ్రీ ఆంజనేయ స్వామి తేరుబజారు మైదానంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మండల నాయకులు రాముడు, వీరేష్, రామకోట్టి హనుమంతులు కోరారు. గురువారం స్థానిక తేరుబజారు మైదానంలో గుంతలు పడిన రోడ్డులో నిల్వ ఉన్న వర్షపు నీటి వద్ద నిరసన తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కోసిగి: కౌమార దశలో ఉన్న బాలబాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోసిగి ప్రాథమిక వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 13 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికల ఆరోగ్య విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్త హీనత కలిగిన పిల్లలు రక్త పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు. అలాగే ఆ వయస్సులో పిల్లలు చెడు అలవాట్లకు జోలికి పోకూడదన్నారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, సూపర్ వైజర్ రాముడు, ఎంఎల్‌హెచ్‌పీ యామిని పాల్గొన్నారు.


రేపు శనిదోష పరిహార పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శ్రావణమాసం శనివారం శని త్రయోదశి సందర్భంగా శని దోషములతో బాధపడుతున్న వారికి శనిదోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ కొప్రేష్ గురువారం తెలిపారు. ఈ ఏడాది అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శని, శని దోషములతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలతో బాధపడుతున్న కర్కాటక, కన్య, కుంభ, మీన, మకర, వృశ్చిక రాశులవారికి దోష పరిహార పూజలు జరుపుతామన్నారు. పూజలు చేయించుకునే వారు 9110731103 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామం శివారు జగనన్న కాలనీ సమీపంలో బోయ కృష్ణ వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గంగాధర్ గురువారం తెలిపారు. 30 ఒరిజినల్ ఛాయిస్, డీలక్స్ విస్కిల 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, ముద్దాయిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరు వేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయమని సర్పంచ్ అనసూయ అన్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఆమె సొంత నిధులతో గురువారం బోరు వేయించారు. ఆమె మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆలయానికి వస్తున్న భక్తులు తాగునీటి సమస్య ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు రూ. 60వేలకు పైగా సొంత నిధులు వెచ్చించి ఈ బోరు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మన్న, గుండ్రాయి లక్ష్మన్న, చింతకుంట గజ్జలయ్య, పెద్దకడబూరప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని ఏఐఐఈఏ కడప డివిజన్ నాయకుడు సునయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఐఐఈఏ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం సంఘ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, సహాయకార్యదర్శిగా ఐజీ రఘునాథ్‌గౌడ్, ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మానందరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ కడప డివిజన్ అధ్యక్షుడు అవదానం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా, రాజారమేష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

ఆదోని అర్బన్/ఎమ్మిగనూరురూరల్: ఆదోని పట్టణంలోని వన్ టౌన్, టూటౌన్, ఎమ్మిగనూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లను బుధవారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లలోని రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ సమర్థవంతమైన పోలీసింగ్‌తో ప్రజల్లో భద్రతాభావాన్ని పెంచాలన్నారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీ పెంచాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రివేళ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానస్పద వ్యక్తులు తారసపడితే విచారించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ వెంట వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


ఆదోని టూటౌన్ పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయండి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఈఓ శ్యాముల్

కోసిగి: మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికలు సంసిద్ధం చేయాలని డీఈఓ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాముల్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ ఏపీ అట్ 2047 కింద మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖకు సబంధించి మండలంలో అన్నీ గ్రామాలకు కావాల్సిన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. 2029 నాటి కల్లా 15శాతం అభివృద్ధికి సాధించేలా చూడాలన్నారు. ఇందుకు సంబందించి వ్యవసాయ, విద్య, వైద్య, తదితర శాఖల అధికారులతో చర్చించారు. ఈనెల ఆఖరిలోగా ప్రణాళికలను తయారు చేసి ఏఎస్ఓ హేమంత్ కుమార్ అందజేయాలన్నారు. సమావేశంలో ఓంఈఓ మెయినుద్దీన్, వ్యవసాయ ఏఓ రాజు, ఈఓపీఆర్డీ హారున్ రషీద్, ఎంఈఓ–2 శోభారాణి, డాక్టర్ అభిరూప్ ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ఆదోని రూరల్: భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను పిల్లలు తెలుసుకోవాలని, వాటిని వినియోగించుకోవడం ప్రాథమిక హక్కు అని ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లీలాసాయి సుభాష్ అన్నారు. గురువారం తిరుమలనగర్‌లోని అనాథ పిల్లల ఆశ్రమాన్ని మెజిస్ట్రేట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనాథాశ్రమంలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వం వారికి కల్పిస్తున్న హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఆశ్రమ నిర్వాహకులు, న్యాయవాదులు ఆనంద్, శ్రీధర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి లీలాసాయి సుభాష్

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి ఎస్కో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నరసింహరెడ్డి, ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు తిమ్మగురుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ మీటర్స్ రీడర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం మీటర్ రీడర్స్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన స్పోర్ట్స్ ఎక్సలెన్సీ 2024 అవార్డు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జెడ్పీ హైస్కూల్‌కు దక్కింది. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని టౌన్‌మోడల్ స్కూల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డీఈఓ శ్యాముల్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, పీఈటీ సుజనకుమారి, నాగేశ్వరి అవార్డును అందుకున్నారు.

కోసిగి: జిల్లా క్రీడా ప్రతిభా అవార్డులకు కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. గురువారం కర్నూలు జాతీయ క్రీడా దినోత్సవం 2024 సందర్భంగా కర్నూలులో జరిగిన కార్యక్రమంలో కోసిగి బాలుర పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్, పీఈటీ శ్రీరాములను క్రీడా ప్రతిభా అవార్డు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.


అవార్డులతో ఎమ్మిగనూరు బాలికల హైస్కూల్ హెచ్ఎం, పీడీలు


కోసిగి పాఠశాల హెచ్ఎం, పీడీలను సన్మానిస్తున్న జిల్లా విద్యాశాఖ బృందం